సమస్యలు పరిష్కరించాలి

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన రాజ్‌కుమార్ రెడ్డి, కాలనీ వాసులు

చంపాపేట, జూన్ 14: శుభోదయ కాలనీలో డ్రైనేజీ పనులు, న్యూ మారుతినగర్ కాలనీలో రోడ్డు పనులు చేపట్టాలని బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీల వాసులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని శుక్రవారం కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శుభోదయ కాలనీలో పైపులైన్ విస్తరణ పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించామని, ఎన్నికల కోడ్‌తో ప్రారంభించలేక పోయామన్నారు. న్యూ మారుతి నగర్‌లో రోడ్డు పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వర్, నాయకులు నర్సింహ, రమేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, జూన్ 14 : సిరీస్, ఎల్బీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ డీఈ కేకే రామకృష్ణ తెలిపారు. సిరీస్ ఫీడర్ పరిధిలో సెంట్రల్ బ్యాంక్ కాలనీ, సూర్యోదయ కాలనీ, సరస్వతీనగర్, మధురానగర్, హాకీమాబాద్ కాలనీ, ఎల్బీనగర్ ఫీడర్ పరిధిలో సరస్వతీనగర్, చింతలకుంట, సూర్యోదయ కాలనీ పరిసర ప్రాంతాలు.

మూసానగర్ పాఠశాలకు అప్‌గ్రేడేషన్



విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, జూన్ 14: ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం మూసానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను ఎమ్మెల్యే శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం, ఎమ్మెల్యే మాట్లాడుతూ, నందనవనం ప్రభుత్వ పాఠశాలలో 8 నుంచి 9వ తరగతిలోకి 88 మంది విద్యార్థులు ప్రమోట్ అయ్యారని, వచ్చే ఏడాది పదో తరగతి ప్రారంభం అవుతుందన్నారు. అందుకోసం ప్రభుత్వ పాఠశాలలో అదనపు అంతస్థుల కోసం రూ.44 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. పాఠశాల హైస్కూల్‌గా మారిన నేపథ్యంలో ఉపాధ్యాయులను నియమించాలని ఎమ్మెల్యే కోరారు. నందనవనం పాఠశాల అప్‌గ్రేడ్ కోసం మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మా శ్రీనివాస్ నాయక్, స్థానిక నాయకులు కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. పాఠశాల అప్‌గ్రేడ్ తోపాటుగా ఉపాధ్యాయులను నియమించి అన్ని వసతులను కల్పిస్తామని ఎమ్మెల్యేకు ఆయన హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమావత్ శ్రీనివాస్ నాయక్, అనంతుల రాజారెడ్డి, అరవింద్‌రెడ్డి, సుజీత్ పాల్గొన్నారు.

వనస్థలిపురం, జూన్ 14: నందనవనంలోని మూసానగర్ ప్రాథమిక పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంపై హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ హర్షం వ్యక్తం చేశారు. జీవో జారీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని గతంలో పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ ప్రాంత విద్యార్థులను పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బడిబాట కార్యక్రమంలో భాగంగా నందనవనంలోని మూసానగర్ స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ హాజరై చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, రేణుక, నరసింహ, మహేశ్ పాల్గొన్నారు.

- వనస్థలిపురం

బడి బాట కార్యక్రమంలో భాగంగా కొత్తగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కొత్తూరు ఎంపీటీసీ జ్యోతి నర్సింహారెడ్డి అక్షరాభ్యాసం చేయించి, ఉచిత పుస్తకాలు, బట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎచ్ఎం ఉమేశ్ రావు, కాంప్లెక్స్ ఎచ్ఎం అంజయ్య, అంగన్‌వాడీ టీచరు తల్లోజు సరస్వతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ వాణి, పంచాయతీ కార్యదర్శి శివ కుమార్ గౌడ్, ఉపాధ్యాయులు సుభాష్ చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

- కందుకూరు

సామూహిక అక్షరాభ్యాసం

మండల పరిషత్ కేంద్ర ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కొత్తగా 1వ తరగతిలో చేరిన చిన్న పిల్లలకు పాఠశాల హెచ్ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారుల తల్లిదండ్రులతో కలిసి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సెంటర్ ఫర్ గ్రీన్ రెవొల్యూషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, సుదేష్ణ, అజిత, వెంకటదేవి, జ్యోతి, రజిత, రాంరెడ్డి, నంద్యాల కావ్య పాల్గొన్నారు.

- చంపాపేట

క్వాలిఫైడ్ టీచర్లతో విద్యాబోధన

క్వాలిఫైడ్ టీచర్లతో విద్యాబోధనలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా నాగోల్ డివిజన్ పరిధి జైపురి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్ రెడ్డి, జైపురి కాలనీ అధ్యక్షుడు ఊరిపక్క రవికుమార్, వరలక్ష్మి పాల్గొన్నారు.

- మన్సూరాబాద్

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మలక్‌పేట, జూన్ 14: గడ్డి అన్నారం బస్తీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నానని మూసారాంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి తెలిపారు. బస్తీ దవాఖాన వద్ద కొనసాగుతున్న నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను, గడ్డి అన్నారం ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, శాలివాహననగర్ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ పరిశీలించారు. పాఠశాలల్లో సమస్యలు తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. అభివృద్ధి పనుల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని, నాణ్యతా లోపం కనిపిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం హెచ్ఎం శారద, శాలివాహననగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకవల్లి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిచంద్ర, టీచర్, జనమిత్రి, బస్తీ వాసులు ప్రభాకర్, ధన్‌రాజ్, సందీప్, సంతోష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మూసారం బాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

1962 అంబులెన్స్‌లో పైలట్, డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 14: పశు సంచార వైద్య సేవలందించే 1962 అంబులెన్స్‌లో పైలట్, డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాసై, 23 నుంచి 35 సంవత్సరాలలోపు వయసున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జీరాక్స్ సెట్‌తో ఇంటర్వ్యూకి హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9000001674 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బక్రీద్ నమాజ్‌కు ఏర్పాట్లు చేయాలి



సైదాబాద్ ఉజాలా షా-ఈద్గాలో ఏర్పాట్లను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, జూన్ 14: బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని ఉజాలా షా ఈద్గా గ్రౌండ్‌ను శుక్రవారం సాయంత్రం సందర్శించి ఏర్పాట్లను జీహెచ్ఎంసీ, విద్యుత్, శానిటేషన్, జల మండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉజాలా షా ఈద్గా మైదానంలో సోమవారం జరిగే ప్రత్యేక ప్రార్థనలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలిరానున్నారని, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

వ్యర్థాలు వెనువెంటనే తొలగించాలి..

కుర్బానీ చేసిన వ్యర్థాలను రోడ్లపై వేయకుండా ఇంటింటికీ గార్బేజ్ కవర్లను పంపిణీ చేసి, జంతువు వ్యర్థాలను అందులో వేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు, ఇంటికి వచ్చే ఆటోట్రాలీ సిబ్బందికి అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డస్ట్ బిన్ల వద్ద జంతు వ్యర్థాలను తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అక్బర్‌బాగ్ కార్పొరేటర్ మినాజుద్దీన్, జీహెచ్ఎంసీ, జల మండలి, విద్యుత్, శానిటేషన్ విభాగాలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాపయ్య మృతి తీరని లోటు

రాచలూరుకు చెందిన పాపయ్య మృతి తీరనిలోటని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఆమె సాయంత్రం గ్రామానికి వచ్చి పార్థివ దేహంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాపయ్య కుటుంబాన్ని ఆదుకోవడానికి కృషి చేస్తానని చెప్పారు. అధైర్యపడొద్దని సూచించారు. ఆమెతో పాటు అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్ రెడ్డి నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు సురుసాని సురేందర్ రెడ్డి, చంద్రశేఖర్, గుయ్యని సామయ్య, బేతు నారాయణ రెడ్డి, రాంరెడ్డి, యాదయ్య ఉన్నారు.

- కందుకూరు

రక్తదానం.. ప్రాణదానం

రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణం కాపాడిన వారిమి అవుతామని ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ చిన్నమారి రాహుల్ రెడ్డి అన్నారు. ప్రాణహిత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ సంఘం బ్లడ్ బ్యాంకు శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శిబిరంలో 150 మంది పాల్గొని రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో

డా.అనిల్ కుమార్, గిరి యాదవ్, డా.గిరివర్ధన్, డా.అలేఖ్య నాయకుడు, సిబ్బంది నాగి రెడ్డి, భరత్, దినేష్ ఉన్నారు.

- ఆర్కేపురం

బీఈడీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 14: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును 18లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును 21లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ.300 అపరాధ రుసుంతో 25 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

లోతట్టులో సమస్యలకు పరిష్కారం చూపండి

లోతట్టు కాలనీల్లో తరచు తలెత్తుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డును ఎత్తుగా లేపడంతో 20 కాలనీలు లోతట్టు ప్రాంతాలుగా మారాయన్నారు. హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్ డబ్ల్యూ అధికారులు సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరి యాదయ్య, అంతటి శ్రీరాములు, పండుగ కరుణాకర్, భాస్కర్ బాబు, ఆనందం, వెంకటయ్య, గుర్రం గోవర్ధన్, మంజుల పాల్గొన్నారు.

- మన్సూరాబాద్

విధులు సక్రమంగా నిర్వహించాలి

జడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ అనితారెడ్డి

కందుకూరు, జూన్ 14: విధులను సక్రమంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి తెలిపారు. రాచలూరు రోడ్డులో గల నిశిత ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న బాలుర బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (ఎంజేపీ) స్కూల్, శ్రీశైలం జాతీయ రహదారి పక్కన గూడూరు గేటు వద్ద ఎన్ఆర్ఐ కళాశాలలో కొనసాగుతున్న గురుకుల బాలికల (టీఎస్‌డబ్లుఆర్ఎస్), జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు పరిశీలించి, హాజరు రిజిస్టర్ చూశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారా.. లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిశిత కళాశాలలో పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారా? అని మండిపడ్డారు. ఇలా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతన్నారా.. లేదా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయులు సమయానికి హాజరుకావాలని, శానిటేషన్, డైనింగ్ హాల్‌తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బాలికల పాఠశాలను సందర్శించి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి పాండు, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ సరిత, ఎంఈఓ మనోహర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సరికొండ మల్లేష్, మాజీ ఎంపీటీసీ పాండు, గుండ్ర సుధాకర్ రెడ్డి, సురుసాని వీరారెడ్డి, పాండు గౌడ్, శ్రీను, జగన్, ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుకూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ అనితారెడ్డి

గుడిసెల జోలికొస్తే ఊరుకునేది లేదు

రావి నారాయణరెడ్డి కాలనీలో సీపీఐ నిరసన



సీపీఐ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్ దత్తు, సీఐ రామకృష్ణ

పెద్ద అంబర్‌పేట, జూన్ 14: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని రావి నారాయణరెడ్డి కాలనీలో వేసుకున్న గుడిసెల జోలికి వస్తే ఊర్కునేది లేదని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. ఒక్క గుడిసెను కూడా తొలగించబోమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, తమ జోలికి రాలేదని, కాంగ్రెస్ సర్కారు వచ్చాకే గుడిసెలను పీకెయ్యాలని చూస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వందల మంది నిరుపేదలు, సీపీఐ నాయకులు శుక్రవారం రావి నారాయణరెడ్డి కాలనీలో ఆందోళనకు దిగారు. గురువారం రాత్రి గుడిసెలను తొలగిస్తారన్న సమాచారంతో స్థానికులు, సీపీఐ నాయకులు రాత్రంతా గస్తీ కాశారు. గుడిసెల జోలికి రావొద్దని విజ్ఞప్తి చేశారు. పాటలతో నిరసన గళం వినిపించారు. ఇది భూదాన్ భూమి అని, కేసు హైకోర్టులో నడుస్తున్నదని, న్యాయస్థానం ఇచ్చే తీర్పును గౌరవిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు ఆందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, హరిసింగ్ నాయక్ పాల్గొన్నారు.

గుడిసెలను ఖాళీ చేయాలి: తాసిల్దార్

కుంట్లూరు సమీపంలోని రావి నారాయణ రెడ్డి కాలనీలో వేసిన గుడిసెలను ఖాళీ చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు కోరారు. హయత్‌నగర్ సీఐ రామకృష్ణతో కలిసి ఆయన అక్కడకు చేరుకున్నారు. సీపీఐ నేతలతో మాట్లాడారు. కోర్టు ఆర్డర్ వచ్చినందున ఖాళీ చేయాలన్నారు. వారం పాటు సమయం ఇస్తున్నామని పేర్కొన్నారు. అధికారులు, పోలీసులకు సహకరించాలని కోరారు.

కాలనీల సమస్యలపై జడ్పీకి వినతి

ఎల్బీనగర్, జూన్ 14: డివిజన్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కొత్తపేట, చైతన్యపురి డివిజన్ల కార్పొరేటర్లు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతిపత్రం సమర్పించారు. కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్, చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్త వేర్వేరుగా జోనల్ కమిషనర్‌ను కలిసి తమ డివిజన్లలో నెలకొన్న సమస్యలను వివరించి ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్పొరేటర్ పవన్ కుమార్, చైతన్యపురి డివిజన్లలోని రోడ్లు సమస్యలపై జోనల్ కమిషనర్ పంకజకు విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామ్మోహన్, వెంకటరమణ పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం అందజేస్తున్న చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహాగుప్త , కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

అనాథ విద్యార్థి గృహానికి నేషనల్ సేవా ధార్మిక్ అవార్డు

రాజేశ్‌కు నేషనల్ సేవా ధార్మిక్ అవార్డు అందజేస్తున్న దృశ్యం

ఆర్కేపురం, జూన్ 14: ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహానికి ప్రఖ్యాత లతా రాజా ఫౌండేషన్ నేషనల్ సేవా ధార్మిక్ అవార్డు, రూ.లక్ష నగదు బహుమతిని ఆంధ్రప్రదేశ్ మాజీ శాసన మండలి సభ్యులు జూపూడి ప్రభాకర్ రావు, పారిశ్రామిక వేత్త శ్రీనివాసరావు చేతుల మీదుగా గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్‌కు అందజేశారు. బడుగు బలహీనవర్గాల వారికి, మానసిక, శారీరక వికలాంగులకు, అనాథ, నిరుపేదలకు చేస్తున్న నాలుగు సంస్థలకు నేషనల్ సేవా ధార్మిక్ అవార్డులను అందజేసినట్లు గృహ నిర్వాహకుడు మార్గం రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా లతా రాజా ఫౌండేషన్ చైర్మన్ కేకే రాజు మాట్లాడుతూ.. అనాథ విద్యార్థి గృహం ఒక వినూత్న పద్ధతిలో నడుస్తున్నదని, ఎలాంటి ఉద్యోగులు లేకుండా, ఎవరికి జీత భత్యాలు లేకుండా కమిటీ సభ్యులు, అనాథ పిల్లలను అక్కున చేర్చుకొని అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించి వారి బంగారు భవిష్యత్తుకు అహర్నిశలు కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం, పెద్దపల్లి జిల్లా సోషల్ వెల్ఫేర్ విశ్రాంత అధికారి మొగిలయ్య అనాథ విద్యార్థుల చదువులకు రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో డా.వరప్రసాద్ రెడ్డి, మాజీ మంత్రి గీతారెడ్డి, రమేశ్, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public is hereby informed that my client Sri K.Nitin Kumar has lost his original link deed, i.e., Regd. AGPA bearing Doc.No. 7783/2023, Dt. 11-8-2023, executed by Yampalla Yadagiri Reddy favoring Cholleti Malla Chary and Registered at SRO, L.B.Nagar, R.R. District relating to Plot No. 46, adm. 150 Sq.yds. in Sy.No.139, Badangpet (V), Balapur (M), R.R. District Near SRO, L.B.Nagar, RR District on 24-4-2024, when he came for Registration of his Sale Deed and not traced despite his best personal efforts. Hence anyone, who finds that original Deed is hereby requested to handover the same to the undersigned and receive suitable remuneration.

KVCMS SARMA, Advocate
#5-77/6, Road No.3, Teachers Guild Colony, Gurramguda, Sagar Road, Hyderabad-501 510,
Cont: 9848081992.